
ప్రజాశక్తి

గురువారం 5 డిసెంబర్ 2024

5

విజయనగరం



ఎడిఐపి క్యాంపుల నిర్వహణకు ఎమ్‌పి వినతి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ఎడిఐపి క్యాంపుల ఏర్పాటు కోసం విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు బుధవారం కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత శాఖా మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్‌కు వినతి అందజేశారు. విజయనగరం జిల్లా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ప్రజలతో కూడిన ప్రాంతమని, పేదరికం, పోషకాహార లోపం వంటి సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని తెలిపారు. ఫలితంగా శారీరక వైకల్యం కలిగిన వ్యక్తుల సంఖ్య జిల్లాలో గణనీయంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఎడిఐపి పథకానికి అనుగుణంగా స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేసి వైకల్యం కలిగిన వ్యక్తులకు కృత్రిమ అవయవాలు, వీల్ చైర్స్ వంటి సహాయక పరికరాలను అందించాలని కోరారు.

విద్యాభివృద్ధే లక్ష్యం



విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేసేందుకు అవసరమైన సలహాలు సూచనలు, దాతల సహకారం కోసం ప్రభుత్వం ఈనెల 7న విద్యార్థులు, తల్లిదండ్రులతో మెగా సమావేశాలు నిర్వహించనుంది. నాణ్యమైన విద్యను అందించడం, కార్య సాధన, దూరదృష్టిని అలవాటు చేయడమే ధ్యేయంగా అన్ని (1796) ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాలు నిర్వహించేందుకు విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. ఈ సమావేశాలల్లో సుమారు లక్షా 30వేల మంది విద్యార్థులతో పాటు, వారి తల్లితండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, దాతలు పాల్గొంటారు.

- 7న మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాలు
- అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహణ
- ప్రత్యేక ప్రణాళిక రూపొందించిన ప్రభుత్వం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విద్యార్థుల్లో సజనాత్మకతను, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, సామాజిక బాధ్యతను అలవాటు చేయడం, స్ఫూర్తిని నింపడం, వారిలోని సాంస్కృతిక ప్రతిభను వెలికి తీసేవిధంగా ఈ సమావేశాలు నిర్వహిస్తారు. తమ సృజనాత్మకతను బట్టి విద్యార్థులే సొంతంగా ఆహ్వాన పత్రాలను రూపొందించి, తల్లితండ్రులను సమావేశాలకు ఆహ్వానిస్తారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో ప్రజాప్రతినిధులను సైతం విద్యార్థులే ఆహ్వానిస్తారు. ఒక సమావేశానికి ఒక ప్రజాప్రతినిధిని మాత్రమే ముఖ్య అతిథిగా ఆహ్వానించ నున్నారు. పాఠశాలను అందంగా అలంకరిస్తారు. స్వాగత ద్వారాన్ని ఏర్పాటు చేస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తారు. తల్లితండ్రుల్లో మహిళలకు రంగోళి, పురుషులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహిస్తారు. ఈ సమావేశాలను సమన్వయంతో, సజావుగా నిర్వహించేందుకు, వివిధ పనులను నిర్వహించేందుకు ప్రతీ పాఠశాల స్థాయిలో 12 రకాల కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమాల పర్యవేక్షణకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీని కూడా ఏర్పాటయ్యింది.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో భాగంగా విద్యార్థులకు ముందుగానే ఆరోగ్య పరీక్షలను నిర్వహించి, ఆరోజున పేరెంట్స్ హెల్త్ కార్డులను అందజేయనున్నారు. జిల్లాలో 3 నుంచి 19ఏళ్ల వయసు ఉన్న సుమారు 2,58,000 మందికి ఆరోగ్య పరీక్షలను నిర్వహించడానికి ప్రణాళికను రూపొందించారు. తొలిదశ క్రింద నియోజకవర్గానికి ఐదు విద్యాసంస్థలను ఎంపిక చేసి, సుమారు 5 వేల మంది చొప్పున జిల్లా వ్యాప్తంగా 35వేల మందికి వైద్య పరీక్షలను నిర్వహించి హెల్త్ కార్డులను సిద్దం చేశారు.

40 రకాల వైద్య పరీక్షలు

పుట్టుకతో వచ్చే వ్యాధులు, వైకల్యాన్ని గుర్తించి, వాటికి సరైన చికిత్సను అందించడం ద్వారా వారు భవిష్యత్తులో ఇబ్బంది పడకుండా ఉండేందుకు అవసరమైన 40 రకాల వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. 40 రకాల పరీక్షలను నిర్వహిస్తున్నారు. ముందుగా ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిలు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి విద్యార్థుల ప్రాథమిక విరాలను సేకరిస్తారు. అవసరమైన వారిని పిహెచ్‌సి వైద్యులు, స్పెషలిస్టు వైద్యులు పరీక్షిస్తారు. వివరాలను వారికి ఇచ్చిన హెల్త్‌కార్డులు, బుక్స్, స్కూల్ హెల్త్ యాప్‌లో నమోదు చేస్తారు. దీనికోసం ఎఎన్ఎంల నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు వరకు వివిధ స్థాయిల్లో శిక్షణ ఇచ్చారు.

పండగ వాతావరణంలో ..



మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాలను పండగ వాతావరణంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ సమావేశాలు ప్రతీ ఒక్కరికీ ఒక మధుర స్మృతిలా మిగిలిపోవాలి. విద్యార్థుల్లో స్ఫూర్తిని రగల్చాలి. వారిలో సృజనాత్మకతను వెలికి తీసి, ప్రతిభకు పట్టం కట్టాలి. నాణ్యమైన విద్యను అందించడంతోపాటు, ఉత్తీర్ణతను పెంచేందుకు ఈ సమావేశాలు దోహదపడాలి. **- కలెక్టర్ బిఆర్ అంబేద్కర్**

ట్రూఅప్ ఛార్జీలు రద్దుచేయాలి

విద్యుత్ స్మార్ట్‌మీటర్లు ఆపాలి ● పట్టణ పౌర సంక్షేమ సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశకి-విజయనగరం టౌన్

విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు రద్దుచేయాలని, అదానీతో చేసుకున్న విద్యుత్తు ఒప్పందాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు వెంటనే ఆపాలని విజయనగరం పట్టణపౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం ఏక గ్రీవ తీర్మానం చెసింది. బుధవారం స్థానిక యుటి ఎఫ్ కార్యాలయంలో విజయనగరం అపార్ట్‌మెంట్స్ అండ్ కాలనీల అసోషియేషన్ కార్యదర్శి యుఎస్ రవి కుమార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ చంద్రబాబు నాడు ప్రపంచ బ్యాంకు జీతగాడు గా పాలించాడని, నేడు అదానీకి అమ్ముడు పోయి విద్యుత్తు ట్రూ అప్ ఛార్జీలు రూ.16800 కోట్లు భారాలు ప్రజలపై వేశారని తెలిపారు. ఇవి చాలవన్నట్లు అదానీ స్మార్ట్ మీటర్లు ఇంటింటికీ బిగిస్తున్నారని చెప్పారు.

ట్రూ అప్ ఛార్జీలను ఉప సంహరించుకునే వరకు ఉద్యమిస్తామని, ప్రజలంతా ఈ పోరాటంలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. సర్దుబాటు ఛార్జీల విధానమే రద్దు కావాలని, ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల వసూళ్ళ నిలిపివేయాలనీ డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు పెట్టడం సరికాదని, వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పాలూరి రమణమ్మ, ఆప్ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు పైల రమేష్‌రాజు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అర్.ఆనంద్, జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.రాజగోపాల్, డివైఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి హరీష్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రవి, అభివృద్ధి వేదిక జిల్లా అధ్యక్షుడు పి. షణ్ముఖ రావు , అయ్యప్ప నగర్ అసోసియేషన్ కార్యదర్శి ఎన్. సుధీర్, మెడికల్ రిప్స్ నాయకులు రామకృష్ణ మాట్లాడారు, ఐద్వా నగర కార్యదర్శి వి.లక్ష్మి, ఎస్ ఎఫ్ ఐ నాయకులు సమీరా, నగర కార్యదర్శి రమేష్ , గ్రీన్ బ్యాంక్ నాయకులు ఆప్ నాయకులు కోటేశ్వరరావు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న పలు సంఘాల నాయకులు

విద్యుత్తు భారంపై రాస్తారోకో

కొత్తవలస : కూటమి ప్రభుత్వం విద్యుత్తు ఛార్జీలు పెంచి ప్రజలపై పెనుభారం మోపుతోందని సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం కొత్తవలస జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదేమి బాదుడంటూ గగ్గోలు పెట్టిన టిడిపి.. ప్రస్తుతం ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై పెనుభారం మోపడం దారుణమన్నారు. పెంచిన ట్రూఅప్, సర్దుబాటు, సర్ ఛార్జీలు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదానీ కుంభకోణంపై ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ నోరు విప్పాలని డిమాండ్‌చేశారు. సోలార్ విద్యుదుత్పత్తి కోసం రైతుల నుంచి తీసుకున్న డి-పట్టా భూములకు కారుచౌకగా ఎకరాకు రూ.30 వేలు మాత్రమే చెల్లించేలా అదానీ ఒప్పందాలు చేసుకున్నారని తెలిపారు. విద్యుదుత్పత్తి ద్వారా నెలకు రూ.5 లక్షల ఆదాయం అదానీకి వస్తుందని వివరించారు. వెంటనే అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు బెహరా సూర్యనారాయణ, రమణ, కె.అప్పారావు, జె.కృష్ణ, ఎస్.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలసలో రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు, కార్మికులు





జామి, రామభద్రపురం ఎంఇఒలకు వినతులు అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి

యుటిఎఫ్ ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

విద్యాశాఖ నిర్ణయాలపై బుధవారం స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పాఠశాలల పని వేళల పెంపు, 10 శాతం మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదనే ఆంక్షలు సరికాదన్నారు. ఈ అసంబద్ధ నిర్ణయాలు ఉపాధ్యాయులను మానసిక ఆందోళనకు గురిచేస్తున్నాయని చెప్పారు. అనంతరం ఎంఇఒ-2 జి.వాసుకు వినతి అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కేశవరావు, రమేష్, మహేష్, సుధాకర్, స్వామినాయుడు, కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు.

జామి : ఉపాధ్యాయులకు అపార్ వంటి బోధనేతర పనులు తగ్గించాలని, ఒత్తిడి తగ్గించి స్వేచ్ఛగా పనిచేసేలా చూడాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు జామి ఎంఇఒకి యుటిఎఫ్ ఆధ్వర్యాన వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల సంసిద్ధత పేరుతో వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో పండగ సెలవుల్లో కూడా పనిచేయాలని ఉత్తర్వులు ఇవ్వడం సరికాదన్నారు. విద్యాశాఖాధికారుల అసంబద్ధ నిర్ణయాలు రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 11న డిఇఒ, 16న డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రాజారావు, మండల అధ్యక్షులు వి.వాసుదేవరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.దేముడు బాబు, మండల నాయకులు ఆర్.సుబ్బలక్ష్మి, ఎస్.ముత్యాలు, ఎం.మహేశ్వరరావు, పి.రామలింగేశ్వరరావు, పి.సూర్యారావు, వి.పైడిపనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు : యుటిఎఫ్ ఆధ్వర్యాన ఎంఇఒ-2 వై.సుధాకర్‌కు వినతి అందించారు. పాఠశాల విద్యాశాఖాధికారుల అసంబద్ధ నిర్ణయాలు రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కిల్లాడ అప్పారావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.రాంప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.శివప్రసాదరావు, వై.స్వామినాయుడు, మండల అధ్యక్షులు మామిడి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : విద్యాశాఖాధికారుల అసంబద్ధ నిర్యయాలను వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఆర్‌సి భవనం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంఇఒ తిరుమలప్రసాద్‌కు వినతి అందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, మండల అధ్యక్షులు సుధాకర్, ప్రధాన కార్యదర్శి శంకర్రావు, సహాధ్యక్షులు జ్యోతి, శశిభూషణరావు, శ్రీరాములు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి రెవెన్యూ సదస్సులు

- సేవలన్నీ పూర్తిగా ఉచితం
- పూర్తి సమాచారంతో హాజరు కావాలి
- కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఈనెల 6 నుంచి జనవరి 8వరకు 33 రోజులపాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ సదస్సుల్లో అందించే సేవలన్నీ పూర్తి ఉచితమని, ప్రజలు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు గ్రామానికి సంబంధించిన పూర్తి సమాచారంతో సదస్సులకు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించారు. ముందుగా జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ మాట్లాడుతూ, సదస్సుల షెడ్యూల్‌ను, నిర్వహించే విధానాన్ని వివరించారు. సదస్సుల్లో స్వీకరించిన ప్రతీ అర్జీకి రసీదు ఇవ్వాలని, అవకాశం ఉన్నవాటిని అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. ప్రతీ అర్జీని ఆన్‌లైన్లో నమోదు చేయాలని, ఆ తరువాత 45 రోజుల్లో గా వాటిని పరిష్కరించాలని చెప్పారు.

కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ సదస్సులకు వచ్చిన దరఖాస్తులను ఏరోజుకారోజు ఆన్‌లైన్లో నమోదు చేయాలని, పెద్ద గ్రామాల్లో సాయంత్రం వరకు నిర్వహించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఇప్పటికే 502 గ్రామాల్లో రీసర్వే పూర్తి అయ్యిందని, ఆ గ్రామాల్లో రీసర్వే సమస్యలపై సుమారు 24,560 దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు. వీటిలో 10,500 దరఖాస్తులు రీసర్వేకు సంబంధించినవి కాగా, 13,200 వరకు రెవెన్యూ సమస్యలపైనే వచ్చాయని చెప్పారు. ఈ సదస్సుల్లో వినతులు ఇచ్చిన వారు మరోసారి రెవెన్యూ సదస్సుల్లో అర్జీలను ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. సదస్సులను నిర్వహణకు రెండు రోజుల ముందే ఆయా గ్రామ పటాన్ని పూర్తిగా భూముల వివరాలతో గ్రామంలో ప్రదర్శనకు ఉంచాలని చెప్పారు. సదస్సును ప్రారంభించే ముందు అధికారులంతా ముందుగా గ్రామంలో పర్యటించాలని సూచించారు.

నెల్లిమర్ల ఎంఎల్ఎ లోకం నాగమాధవి మాట్లాడుతూ, తమకు వచ్చే సమస్యల్లో సుమారు 60 శాతం వరకు రెవెన్యూకు సంబంధించినవేనని చెప్పారు. పేద ప్రజలకు అన్యాయం జరగకుండా, వారి భూములకు రక్షణ కల్పించే బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. భూముల విలువ అమాంతంగా పెరిగిపోవడంతో, ప్రభుత్వ భవనాల నిర్మాణానికి సైతం గ్రామాల్లో ఎక్కడా స్థలం దొరకడం లేదని చెప్పారు. ఎపి మార్క్ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ, భోగాపురం విమానాశ్రయ భూసేకరణలో పలు అవకతవకలు జరిగాయని చెప్పారు. సుమారు 152 మంది అసలు హక్కుదారులకు నేటికీ పరిహారం అందలేదని, వారికి న్యాయం చేయాలని కోరారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్దరాజు రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ దళితులకు ఇచ్చిన శ్మశాన స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని, సదస్సులు ప్రారంభానికి ముందే వాటిని గుర్తించి, దళితులకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెద్దల ఆక్రమణల్లో ఉన్న అన్యాక్రంతమైన భూములను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. గంగచోళ్లపెంట నుంచి పురిటిపెంటకు ఉన్న సాగునీటి కాలువ ఆక్రమణకు గురైందని, ఆ సమస్య పరిష్కరించాలని కోరారు. రీసర్వేపై వచ్చిన వినతులను పరిష్కరించాలని కోరారు. పలు సమస్యలతో కూడిన వినత పత్రాల కాపీలను రైతులకు ముందుగానే అందజేయాలని కోరారు. తుమ్మిఅప్పలరాజు దొర మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిల భూముల రికార్డులు తారుమారయ్యాయని, తక్షణమే సమస్య పరిష్కరించాలని కోరారు. డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, మండల ప్రత్యేకాధికారులు, ఎస్‌డిసిలు, ఆర్‌డిఒలు, తాహశీల్దార్లు, ఎన్‌జిఒలు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యకాస జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాస్

జాతీయ కబడ్డీ పోటీలకు అనురాధ ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 7 నుండి 10వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో జరగబోయే స్కూల్ గేమ్స్ అండర్ 19 జాతీయ కబడ్డీ పోటీలకు విజయనగరానికి చెందిన శ్రీనివాస జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఎన్. అనురాధ ఎంపికైంది. ఆమె ఎంపిక పట్ల వ్యాయామ ఉపాధ్యాయిని సౌదామని, కళాశాల ప్రిన్సిపల్ మరియు కరస్పాండెంట్లు హర్షం వ్యక్తం చేశారు.

6న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 6న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సి.హెచ్. కేశవరావు, జెకెసి కోఆర్డినేటర్ జి.ఈరన్న ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాకు పదో తరగతి నుంచి పిజి పూర్తి చేసిన 18 నుండి 35 ఏళ్ల అభ్యర్థులు అర్హులని తెలిపారు. జాబ్ మేళాకు మెడ్ ప్లస్ ఫార్మసీ, జాబ్ డీలర్స్ కంపెనీలు హాజరవుతాయని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు తమ వివరాలను skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఫోన్ నెంబర్ 7995691295ను సంప్రదించాలని కోరారు.

మెగా టీచర్స్, పేరెంట్స్ సమావేశానికి ఎండిఎం ఛార్జీలు పెంచాలి

విజయనగరం టౌన్ : ఈనెల 7న విద్యాశాఖ నిర్వహించే మెగా టీచర్స్, పేరెంట్స్ సమావేశానికి ప్రస్తుతం ఉన్న మెనూ ఛార్జీల ప్రకారం భోజనం పెట్టలేమని, మెస్ ఛార్జీలు రూ.30కు పెంచాలని సిఐటియు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం నాయకులు డిప్యూటీ డిఇఒకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్, నాయకులు ఎ.జగన్మోహన్ మాట్లాడుతూ శనివారం జరగనున్న మెగా టీచర్స్ పేరెంట్స్ సమావేశానికి విద్యార్థులతో పాటు సమావేశానికి వచ్చే వారికి భోజనం పెట్టాలని ప్రభుత్వం చెబుతుందన్నారు. అయితే కేవలం రూ.6.50, రూ.9.50 ఇస్తామనడం సరికాదన్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలు ప్రకారం ఆ ధరలకు ఈ డబ్బులతో వండి పెట్టలేమన్నారు. ఇస్తున్న డబ్బులకు పెట్టలేని పరిస్తితి ఉందని, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పై ఒత్తిడి తేవొద్దని తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో పలువురు కార్మికులు ఉన్నారు.



తడిసిన వరిపనలను చూపిస్తున్న కౌలురైతు గంగమ్మ

తుపాను దెబ్బకు

కౌలురైతు కుదేలు

- వర్షాలతో తడిసిన వరి పనలు
- లబోదిబోమంటున్న కౌలుదారులు
- ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్

సాగుకు రూ.2.50 లక్షలు అప్పు చేశాం

కౌలుకు ఎనిమిది ఎకరాలు భూమిని తీసుకుని వరిపంట సాగు చేశాం. రూ.2.50 లక్షలు అప్పు చేసి పంటకు పెట్టుబడి పెట్టాం. వర్షాలతో పంట నష్టపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

- వంజరాపు గంగమ్మ, కౌలురైతు, గొల్లపల్లి

ప్రజాశక్తి-బొబ్బిలి


జీవనోపాధి కోసం కౌలుకు భూమి తీసుకుని వ్యవసాయం చేసుకుంటున్న కౌలురైతులు.. ఫెంగల్ తుపాను దెబ్బకు కుదేలయ్యారు. ఇటీవల మూడు రోజులపాటు కురిసిన వర్షాలతో కోసిన వరిచేనంతా తడిసి ముద్దయింది. అనంతరం మూడు రోజులపాటు మబ్బులు కాయడంతో తడిసిన పంట ఎండే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ధాన్యం రంగు మారే అవకాశం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మున్సిపాలిటీలోని గొల్లపల్లిలో ఎక్కువగా కౌలురైతులున్నారు. పలువురి భూములను వారు కౌలుకు తీసుకుని వరి సాగు చేశారు. వారం రోజుల క్రితం వీరంతా వరి పంటను కోశారు. ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలతో కౌలురైతులు కోసేసిన వరి పంట తడిసిపోవడంతో కన్నీరు పెడుతున్నారు. అప్పులు చేసి కష్టపడి సాగు చేసిన పంట వర్షార్పణం కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పంట నష్టపోయిన తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

కౌలురైతుల కన్నీరు

గొల్లపల్లికి చెందిన బైరెడ్డి సత్తి ఎకరా, పొందూరు సత్యనారాయణ ఎకరా, రెడ్డి శ్రీను రెండు ఎకరాలు, పాచిపెంట నారాయణరావు మూడు ఎకరాలు, కలగట్ల మధు రెండు ఎకరాలు భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. వీరంతా అప్పులు చేసి సాగు చేస్తే వర్షాలకు తడిసిపోవడంతో వారంతా కన్నీరు పెడుతున్నారు.

తాళిబొట్లు తాకట్టు పెట్టి..



నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకున్నారు. వరిసాగు కోసం నా తాళి బొట్టుతోపాటు కుమార్తె తాళిబొట్టు తాకట్టు పెట్టి, పెట్టుబడి పెట్టాం. వరిపంటంతా వర్షానికి తడిసిపోయింది. పంట తడిసిపోవడంతో బ్యాంకు అప్పు ఎలా తీర్చాలి? ప్రభుత్వం పంట నష్టపరిహారం ఇవ్వాలి.

- శనపతి అనసూర్య, కౌలు రైతు, గొల్లపల్లి

ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి

కౌలుకు తీసుకున్న భూమికి ఎకరాకు రూ.10 వేలు చొప్పున కౌలు చెల్లించాం. ఎకరా సాగు చేసేందుకు రూ.20వేలు వరకు పెట్టుబడి పెట్టాం. రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని, సాగు చేయడంతో రూ.60 వేలు ఖర్చయింది. వర్షాలకు పంటంతా తడిసిపోవడంతో పెట్టుబడి నష్టపోయాం.

- రెడ్డి శ్రీను, కౌలు రైతు, గొల్లపల్లి

6న డైట్‌లో కళా ఉత్సవ్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ప్రభుత్వం ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో ఈ నెల 6న జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ జి.పగడాలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం (శాస్త్రీయ జానపదం), నాటకం, దృశ్యకళలు (చిత్ర లేఖనం 2డి, 3డి), సంప్రదాయ కథ చెప్పడం వంటి అంశాల్లో 6 నుంచి ఇంటర్ ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఒక విద్యార్థి ఒకటి కంటే ఎక్కువ అంశాల్లో ఉండరాదని, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులవుతారని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు పి.రవి కుమార్ (7989350244), కె.సూర్యారావు (8919985388)ను సంప్రదించాలని కోరారు.

1147 క్వింటాళ్ల పత్తి కొనుగోలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో ఇప్పటివరకు 1147 క్వింటాళ్ల పత్తి 138 మంది రైతుల నుంచి సిసిఐ కొనుగోలు చేసిందని మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి బి.రవికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో క్వింటా రూ.7521కు విక్రయించుకోవచ్చని తెలిపారు. త్వరలో రాజాం లో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

లక్ష్యాలను శత శాతం పూర్తి చేయాలి

మెప్మా పీడీ చిట్టిరాజు

విజయనగరం టౌన్ : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ లక్ష్యాలను శత శాతం సాధించేలా సిబ్బంది కృషి చేయాలని పీడీ జివి చిట్టిరాజు కోరారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌పిలంతా క్రమశిక్షణతో పనిచేసి మెప్మా సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎస్‌హెచ్‌జి ప్రొఫైలింగ్, పిఎం స్వానిధి, ఎంఎస్‌ఎంఇ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సిఎం ఎం.సన్యాసిరావు, ఆర్‌పిలు పాల్గొన్నారు.

డొమెస్టిక్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం కోట : జిల్లా కేంద్రంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విటి అగ్రహారం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలోని నైపుణ్య కేంద్రంలో డొమెస్టిక్ ఐ.టి హెల్ప్ డెస్క్ కోర్సు మూడు నెలలు శిక్షణకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటిఐ ప్రిన్సిపల్ టివి గిరి తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 18 నుంచి 35 ఏళ్లలోపు ఉండి, ఇంటర్, ఆపై చదువుకున్న వారంతా అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి వున్న అభ్యర్థులు విద్య అర్హత ధ్రువపత్రాలు , ఆధారు కార్డ్, 2 ఫోటో లతో విటి అగ్రహారంలోని ప్రభుత్వ ఐటిఐకు రావాలని కోరారు. ఈనెల 6వ తేదీ లోపు అభ్యర్థులు https://forms.gle/vkUYDKj9DZyaHY2T అనే లింక్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 7780658035, 9849118075 నంబరుకు సంప్రదించాలని కోరారు.

పంచ వైష్ణవ క్షేత్ర దర్శనానికి స్పెషల్ బస్సులు

విజయనగరం కోట : మార్గశిరమాశం లో పంచవైష్ణవ క్షేత్రాలను దర్శించుకునేందుకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు ఆర్‌టిసి డిపో మేనేజరు. జె. శ్రీనివాసరావు తెలిపారు. ఈ ప్రత్యేక సర్వీసులు డిసెంబర్ 7, 14, 21, 28 తేదీల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయన్నారు. మార్గశిర మాసంలో పంచ వైష్ణవ క్షేత్రదర్శిని పేరుతో ఈ సర్వీసులు నడుస్తాయన్నారు. ఆయా తేదీల్లో విజయనగరం బస్‌స్టేషన్ నుంచి రాత్రి 8 గంటలకు బస్సులు బయలుదేరుతాయని,ముందుగా ద్వారకా తిరుమలలో శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనం ఉంటుందని, ఆ తర్వాత అక్కడ నుంచి అంతర్వేది చేరుంటారని తెలిపారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి దర్శనం అనంతరం అప్పనపల్లి చేరుకుంటారని, అక్కడ శ్రీబాల బాలజీ స్వామిని దర్శించుకుని, గొల్లలమామిడాడలో కోదండ రాముడి దర్శనం ఉంటుందని తెలిపారు. అనంతరం అన్నవరంలో సత్యనారాయణ స్వామి దర్శనం ఉంటుందని, అక్కడి నుంచి విజయనగరం చేరుకుంటారని తెలిపారు. ఒక్కో టిక్కెట్ ధర రూ.1970 ఉంటుందని తెలిపారు.



స్థలానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కీర్తి

ఇంధన కేంద్రానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం విమానాశ్రయానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. విమానాలకు ఇంధనాన్ని నింపే కేంద్రాన్ని నిర్మించేందుకు ఆర్‌డిఒ డి.కీర్తి బుధవారం స్థలాన్ని పరిశీలించారు. విమానాశ్రయం లోపల అమటాం సమీపంలోని సర్వే నెంబర్లు 100, 109లో ఏడున్నర ఎకరాలలో దీనిని నిర్మించనున్నారు. విమానాలకు ఇక్కడి నుంచే ఇ-ఫిల్లింగ్ స్టేషన్ ద్వారా ఇంధనాన్ని నింపనున్నారు. దీని నిర్మాణానికి హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, జిఎంఆర్ సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం మేరకు హెచ్‌పిసిఎల్‌కు చెందిన ప్రతినిధులు, జిఎంఆర్ సిబ్బంది కూడా స్థలాన్ని పరిశీలించారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభం కానున్నాయి. కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్, ఆర్ఐ ఇమ్రాన్ పాల్గొన్నారు.

రోడ్డు వేయాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట



విఎంఆర్‌డిఎ కమిషనర్‌కు వినతి అందిస్తున్న ఎమ్మెల్యే

మండలంలోని కృష్ణాపురం గ్రామానికి తారు రోడ్డు వేయాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని ఆ గ్రామస్తులు బుధవారం క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కృష్ణాపురం నుంచి సీతంపేట ఉన్న తారురోడ్డు పదేళ్లుగా పూర్తిగా పాడైపోయిందని తెలిపారు. దీంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, ప్రధాన కార్యదర్శి జుత్తాడ రామసత్యం, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఇందుకూరి శ్రీనురాజు, మామిడిపల్లి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

విఎంఆర్‌డిఎ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే

విశాఖపట్నంలోని విఎంఆర్‌డిఎ కమిషనర్ సంపత్‌కుమార్‌ను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మర్యాదపూర్వకంగా కలిశారు. రూ.కోటి అంచనా వ్యయంతో కృష్ణాపురం గ్రామానికి బిటి రోడ్డుకు వేయాలని ఆయనను కోరారు. ఈ మేరకు ఆయనకు వినతి అందించారు.

ఘనంగా ఘంటసాల జయంతి

ప్రజాశక్తి-విజయనగరంకోట




వయొలిన్ వాయిస్తున్న కామాక్షి

గాన గంధర్వుడు ఘంటసాల 102వ జయంతి వేడుకలు బుధవారం ఆనంద గజపతి ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఘంటసాల స్మారక పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు ఎం. భీష్మారావు సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిర్విరామ సినీ సంగీత స్వరార్చన కొనసాగింది. ప్రముఖ సంగీత దర్శకులు సాయి, పవన్ సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వయోలిన్ విద్వాంసురాలు కామాక్షి అంబటి పూడి వయోలిన్ శ్రవణానందంగా సాగింది. శ్రోతల కరతాళధ్వనులు మారుమోగాయి. కార్యక్రమంలో నగర కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ , కళాపీఠం గౌరవాధ్యక్షులు నరసింహరాజు, కార్యదర్శి దవళ సర్వేశ్వరరావు, కోశాధికారి ఇ.వి.వి.సత్యనారాయణ, అధ్యక్షులు గ్రంధి విష్ణు మూర్తి, కార్యనిర్వహణక అధ్యక్షులు మేకా కాశీ విశ్వేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు హమాలీ ఛార్జీల చెక్కులు

ప్రజాశక్తి- మెంటాడ



చెక్కులు అందజేస్తున్న పిఎసిఎస్ సిఇఒ ప్రసాదరావు

2021-22 సంవత్సరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల తాలూకా హమాలీ ఛార్జీల చెక్కులను రైతులకు బుధవారం స్థానిక పిఎసిఎస్‌లో పంపిణీ చేశారు. సుమారుగా 1800 మంది రైతులకు మూడేళ్ల తరువాత రూ.8.65 లక్షలకు సంబంధించి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ సిఇఒ వి.ప్రసాదరావు, ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, జనవిజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి గంట్రేటి అప్పలనాయుడు, పిఎసిఎస్ సిబ్బంది పి.విశ్వేశ్వరరావు, పి.వెంకట చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి సర్వే

ప్రజాశక్తి-శృంగవరపు కోట

శృంగవరపుకోట మేజర్ పంచాయతీ పరిధిలోని గురిలోవ గిరిజన గ్రామానికి రెండు కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సర్వేయర్ రాజేష్, జనసేన నియోజకవర్గ నాయకుడు వబ్బిన సన్యాసినాయుడు పాల్గొన్నారు.

పన్నులకు అపరాధ రుసుం మినహాయింపు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీలో అపరాధ రుసుం లేకుండా పన్నులు చెల్లించాలని కమిషనర్ కె.అప్పలరాజు సూచించారు. బుధవారం ఇందిరా నగర్ కాలనీ సచివాలయ పరిధిలో పన్నుల చెల్లింపు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆస్తి, కుళాయి పన్ను, ట్రేడ్ లైసెన్సులు త్వరితగతిన చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమాభాస్కర్ పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-వేపాడ



మాట్లాడుతున్న ఎంఇఒ జగదీశ్వరరావు

ఈ నెల ఏడో తేదిన నిర్వహించే మెగా పేరెంట్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఇఒలు జగదీశ్వరరావు, బాల భాస్కరరావు కోరారు. స్థానిక ఎంఆర్‌సిలో బుధవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

మెరకముడిదాం : ఈ నెల ఏడో తేదీన బైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు మరడాన ఈశ్వరరావు తెలిపారు. విద్యార్థుల ప్రగతి, మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై తల్లిదండ్రుల సలహాలు తీసుకోనున్నట్లు చెప్పారు.

గర్భిణులకు సహకారం అవసరం

ప్రజాశక్తి-బొండపల్లి

గర్భిణులు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండటానికి కుటుంబ సభ్యుల సహకారం ఎల్లప్పుడూ ఉండాలని గంట్యాడ ఐసిడిఎస్ సిడిపిఒ ఉమాభారతి అన్నారు. బుధవారం బొండపల్లి మినీ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ ఆహ్వానం, ప్రీ స్కూల్ సంసిద్ధత అనే కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. పలువురు గర్భిణులకు ఆహ్వానం పలకడమే కాకుండా వారికి సీమంతం చేశారు. ఈ సందర్భంగా సిడిపిఒ ఉమాభారతి మాట్లాడుతూ ప్రసవానికి ముందుగానే ప్రణాళిక తయారీ చేసుకోవాలని గర్భిణుల కుటుంబ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

అభిమాని ఫౌండేషన్ అధ్యక్షులు రెడ్డి రాజగోపాల్ ఆధ్వర్యంలో బుధవారం ముగ్గురు మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు అభిమాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మన బొబ్బిలి సేవా సంఘం గౌరవ అధ్యక్షులు మింది శ్రీనివాస్, కాజా గోపాల రావు, గేదెల చంద్రి నాయుడు, గోనా చంద్ర శేఖర్, రేవల్ల కిరణ్, బ్రహ్మాజీ పాల్గొన్నారు.

రూ.10 వేలు వేతనం ఇవ్వాలి

గ్రీన్ అంబాసిడర్ల ధర్నాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గ్రామాల్లో ఇంటింటి చెత్త సేకరణ, పారిశుధ్యం, వాటర్ సప్లై, స్ట్రీట్ లైట్ల తదితర పనులు చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు జీవో నెంబర్ 680 ప్రకారం కనీస రూ.10వేలు వేతనం చెల్లించాలని, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్ మాట్లాడుతూ కనీస వేతనం రూ.10వేలు చెల్లించాలని, కార్మికులు మరణిస్తే మట్టి ఖర్చులు ఇవ్వాలని, రాజకీయ కారణాలతో ఎవరినీ తొలగించరాదని హైకోర్టు గత ప్రభుత్వాన్ని హెచ్చరించిందని అన్నారు. కానీ ప్రభుత్వాలు మారిన ప్రతి సందర్భంలో దినదిన గండం నూరేళ్ల ఆయుషుగా గ్రీన్ అంబాసిడర్ల దుస్థితి ఉందన్నారు. జీతం పెంచలేక సరికదా కేంద్ర ప్రభుత్వ పుణ్యమా అని గత ప్రభుత్వం గ్రీన్ అంబాసిడర్లకు చెల్లించే జీతాలను పంచాయతీలకు బదలాయించారని, దీంతో వేధింపులు పెరిగాయని తెలిపారు. ఆదాయం లేదని జిల్లాలో చాలా పంచాయతీల్లో నెలలు తరబడి జీతాలు చెల్లించడం లేదన్నారు. మరణించిన కార్మికుల బిడ్డలకు ఉపాధి కల్పించి, మట్టి ఖర్చులు రూ.15వేలు, ఎక్స్ గ్రేషియా రూ.5లక్షలు చెల్లించాలని, రాజకీయ తొలగింపులు, వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఉద్యోగభద్రత కల్పించాలని, ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలనికోరారు.





దెంకాడ, జామి ఎంపిడిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు చేస్తున్న సిఐటియు నాయకులు, గ్రీన్ అంబాసిడర్లు

అనంతరం ఎంపిడిఒకు వినతి అందజేశారు.

జామి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట బుధవారం సిఐటియు ఆధ్వర్యాన గ్రీన్ అంబాసిడర్ల ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ అప్పలనాయుడుకు వినతి పత్రం అందజేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, గ్రీన్ అంబాసిడర్ల సంఘం జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రత, ప్రజల ఆరోగ్య రక్షణ కోసం పనిచేస్తున్న గ్రీన్‌అంబాసిడర్లంతా నిరుపేదలని తెలిపారు. వీరంతా తమ ప్రాణాలు పణంగా పెట్టి పనిచేస్తుంటే పాలకులు.. వీరికి చెల్లించాల్సిన జీతాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. జిల్లాలో ఇప్పటికి నాలుగు నుంచి 12 నెలల వరకు వేతన బకాయిలు ఉన్నాయని చెప్పారు. వెంటనే బకాయిలు జీతాలు చెల్లించాలని, రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో పి.శ్యామ్, ఎస్.ఎరకయ్య, మరామ్మ, ముత్యాల అప్పడు, సన్యాసిరావు, వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

దెంకాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద బుధవారం సిఐటియు ఆధ్వర్యాన గ్రీన్ అంబాసిడర్లు ధర్నా చేశారు. అనంతరం ఎంపిడిఒ వై.భవానికి వినతి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. ఇప్పటికే పెండింగ్ ఉన్న జీతాలను త్వరగా ఇచ్చే ఏర్పాటు చేయాలన్నారు. మరణించిన కార్మికులకు రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్‌చేశారు. రాజకీయ వేధింపులు ఆపాలని చెప్పారు. కార్యక్రమంలో పెంట వెంకట్రావు, నారాయణరావు, నాగరాజు, ఎద్దు సూరిబాబు, లక్ష్మణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆయాను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-గజపతినగరం

రామన్నపేట అంగన్వాడీ ఆయా సౌజన్యను అక్రమ తొలగించారని, వెంటనే ఆమెను విధుల్లోకి తీసుకోవాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి పి.జ్యోతి డిమాండ్ చేశారు. బుధవారం పురిటిపెంట సచివాలయం వద్ద అంగన్వాడీలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నుంచి రామన్నపేట సర్పంచ్ అరుణ్.. అంగన్వాడీ ఆయాపై రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఐసిడిఎస్ పీడీ సమగ్ర దర్యాప్తు చేసి, సోమవారానికి ఆమెకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే సోమవారం నుండి రిలే నిరాహార దీక్షలు ప్రారంభిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షులు ఎం సుభాషిని, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, ముత్యాలమ్మ, సౌజన్య, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేవీ డే

శృంగవరపుకోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం భారత నౌకాదళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎస్.కె.వలీఖాన్ అధ్యక్షతన జరిగిననీ కార్యక్రమంలో సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ లెక్చరర్ ఎం.గోవిందరావు మాట్లాడుతూ నేవి డే విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు లెక్చరర్ డాక్టర్ రేచర్ల శ్రీలక్ష్మి, లక్ష్మణ్, శివ రామకృష్ణ పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణం వేగవంతం

అటవీశాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్‌కృష్ణ

ప్రజాశక్తి-బొబ్బిలి



సుజయ్‌కృష్ణను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

రాజధాని నిర్మాణం వేగవంతం చేసేందుకు కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తుందని అటవీశాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు తెలిపారు. బుధవారం స్థానిక కోటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని, భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణంతో పాటు పట్టణ, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. పోలవరం పూర్తి చేసి, నదులను అనుసంధానించి, రైతులకు సాగునీరు ఇచ్చేందుకు ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉపముఖ్యమంత్రి పవన్ దృష్టి పెట్టారని చెప్పారు.

సుజయ్యకృష్ణకు ఘన స్వాగతం

అటవీశాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత బొబ్బిలి మొదటిసారిగా వచ్చిన సుజయ్‌కృష్ణ రంగారావుకు ఎమ్మెల్యే బేబినాయన, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. కోటలో డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. సుజయ్‌కృష్ణకు శుభాకాంక్షలు చెప్పేందుకు అభిమానులు, కార్యకర్తలు క్యూకట్టడంతో కోటంతా సందడిగా మారింది.

అదనపు ధాన్యం ఇవ్వొద్దు

వ్యవసాయ శాఖ ఎడి విజయ

ప్రజాశక్తి - జామి

రైతు కోరుకున్న మిల్లుకు అదనపు ధాన్యం ఏమీ లేకుండా విక్రయించొచ్చని వ్యవసాయ శాఖ ఎడి ఎల్.విజయ తెలిపారు. ధాన్యం పంపిన రెండు రోజుల్లోగా రైతుల ఖాతాలకు సొమ్ము జమ అవుతుందని చెప్పారు. మండలంలోని రామభద్రపురం రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన పొలంపిలుస్తోంది సభలో ఆయన మాట్లాడారు. రైతులు కేవలం 17 శాతం తేమ ఉండేలా చూసుకోవాలని సూచించారు. ప్రధానంగా పంటల బీమాకు ఈ నెల 15వ తేదిలోపు బ్యాంకుల ద్వారా కానీ, మీసేవ ద్వారా కానీ రైతులు ప్రీమియం చెల్లించుకుంటే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో రైతు ఎన్‌రోల్‌మెంట్ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బాడంగి : మండలంలోని బాడంగి, డొంకినవలస గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎఒ శిరీషా మాట్లాడుతూ అపరాలలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో విఎఎలు జయలక్ష్మి, మురళి, ఎఐసి కోఆర్డినేటర్ రవికుమార్ పాల్గొన్నారు.

రబీ పంటలకు బీమా చేసుకోండి

బొబ్బిలి : రబీ పంటలకు బీమా చేసుకోవాలని రైతులను వ్యవసాయ శాఖ ఎడి మజ్జి శ్యామసుందర్ కోరారు. 2024-25 రబీ సీజన్‌లో సాగు చేస్తున్న అపరాలు, మొక్కజొన్నకు ఈనెల 15లోగా, వరి పంటకు ఈ నెల 31లోగా బీమా ప్రీమియం చెల్లించాలని కోరారు. పంటల బీమా చేసుకుని నష్టపోయిన పంటలను భీమా నుంచి రక్షించుకోవాలన్నారు. పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

కార్మికుల రిలే దీక్షలు

ప్రజాశక్తి-చీపురుపల్లి



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న కార్మికులు

వేతన ఒప్పందం అమలు చేయాలని మండలంలోని కర్లాంలో ఉన్న వెంకటరామా పౌల్ట్రీ ముందు బుధవారం కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంబళ్ల గౌరినాయుడు, సీనియర్ నాయకులు జె.విశ్వనాథరాజు ఈ దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కార్మికులతో చేసుకున్న వేతన ఒప్పందాన్ని వెంకటరామా పౌల్ట్రీ యాజమాన్యం అమలు చేయక పోవడం విచారకరమన్నారు. ఈ నెల 3న జెసిఎల్ వద్ద జరిగిన చర్చల్లో యాజమాన్యం రూ.250 కంటే పెంచలేమని చెప్పడంతో కార్మికులు పోరాటాన్ని ఉధృతం చేశామన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం మొండి వైఖరి వీడి కార్మికులకు నూతన వేతన ఒప్పందం చేయాలని డిమాండ్‌చేశారు.

ఇథనాల్ ప్లాంట్ ఎదుట పుర్లి గ్రామస్తుల ధర్నా

ప్రజాశక్తి-రేగిడి



పోలీసులతో మాట్లాడుతున్న పుర్లి గ్రామస్తులు

సంకిలి ప్యారీ షుగర్స్ ఇథనాల్ ప్లాంట్ వద్ద బుధవారం పుర్లి గ్రామస్తులు ధర్నా చేశారు. క్రషింగ్ ప్రారంభించడంతో చిన్నయ్యపేట సెంటర్ నుంచి పెద్దపుర్లి జిల్లా పరిషత్ రోడ్‌లో కర్మాగార వ్యర్థ పదార్థాలు, రోడ్డుకు ఇరువైపులా చెరకు లారీలు ఉంచడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు తెలిపారు. రోడ్డుపై వ్యర్థ పదార్థాలు నిల్వ ఉంచడంతో కొద్దిపాటి వర్షానికి రోడ్డు తడిసినా ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. పాలకొండ, రాజాం పట్టణాలకు చదువు కోసం వెళ్లే విద్యార్థినులను డ్రైవర్లు ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. యాజమాన్యం సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. క్రషింగ్ సీజన్ అంతా ఇబ్బంది పడుతున్నామని, ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పోలీసులను గ్రామస్తులు పాలవలస మురళి, పాలవలస బుల్లిబాబు, రమణ నిలదీశారు. ఇకపై రహదారిపై వ్యర్థాలు ఉండకుండా చర్యలు తీసుకుంటామని యాజమాన్య ప్రతినిధులు హామీనివ్వడంతో ఆందోళనను విరమించారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల సంయుక్తంగా సోషల్ మీడియా, సైబర్ నేరాలపై విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రేఖ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ సిఐ. లెంక అప్పలనాయుడు మాట్లాడుతూ, టాస్క్ బేస్డ్ టార్గెట్స్ వలన డీజిల్ అరెస్ట్‌లు జరుగుతున్నాయని, క్షణికావేశాల వలన, చైల్డ్ ఫోర్నోగ్రఫీ జరుగుతుందని, మనకు పడని వ్యక్తులను పరువు ప్రతిష్టలు దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఫోటో మార్ఫింగులు జరుగుతున్నాయని, వీటి మీద అవగాహన పెంచుకుని వీటికి దూరంగా ఉండాలని చెప్పారు. ప్రముఖ సైక్రియాటిస్ట్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్, జి హిమబిందు మాట్లాడుతూ కిడ్నాప్,మానవ అక్రమ రవాణా రూపం మార్చుకుని, సెల్ఫోన్ లవ్ పేరుతో ఇంట్లోనే ఉండి కూడా మోసపోతూ ఆపదకు గురవుతున్నారని చెప్పారు. సీనియర్ న్యాయవాది ఐ. సురేష్, సంస్కృత కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. జనార్దన్ నాయుడు సాంకేతికత, దుష్పరిణామాలు గురించి వివరించారు. డాక్టర్ కె రేఖ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు, సమాజాన్ని కూడా పరిశీలించాలని చెప్పారు.కోఆర్డినేటర్లుగా డాక్టర్ జీవీఎస్ జయపాల్ రావు, వావిలాపల్లి సత్యనారాయణ వ్యవహరించారు.

పెంపకందారులకు నష్టపరిహారం ఇవ్వాలి



పెంపకందారులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు రామారావు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

అనారోగ్యంతో 150 గొర్రెలను కోల్పోయిన పెంపకందారులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్‌చేశారు. బుధవారం మండలంలోని పెదబూరాడపేటలో బాధిత పెంపకందారులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 మందికి చెందిన 150 గొర్రెలు మృతిచెందడంతో వారి జీవనం అగమ్యగోచరంగా మారిందన్నారు. ప్రకృతి వైపరీత్యం వల్ల గొర్రెలు చనిపోవడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 20 లక్షల రూపాయలు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గొర్రెల పెంపకందారులు డొప్ప త్రినాథ్, కర్రి సూర్య నారాయణ, ధూళి గౌరి నాయుడు, ధూళి పైడి తల్లి, డొప్ప సత్యం, ఆవాల సన్యాసమ్మ, తదితరులున్నారు.

చంగయ్యపై దాడి చేసిన వారిని శిక్షించాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం కోట

తిరుపతి జిల్లాలో వెంకటేశ్వర యూనివర్సిటీలో విధుల్లో ఉన్న ప్రొఫెసర్ చెంగయ్యపై భజరంగ్ దళ్ గూండాల దాడిని ఖండిస్తూ బిఎస్‌పి ఆధ్వర్యాన బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు మాట్లాడుతూ చెంగయ్య మత బోధనలు చేస్తున్నారనే నెపముతో కక్షపూరితంగా తన ఛాంబర్ లోకి ప్రవేశించి దాడి చేసి ఆఫీసులో ఉన్న ఫోటో ఫ్రేములను ఫర్నిచర్ ను ధ్వంసం చేసి దారుణంగా కొట్టారని తెలిపారు. అనంతరం కారులో ప్రయాణిస్తున్న సమయంలో దారిలో అడ్డగించి కారుని ధ్వంసం చేశారని తెలిపారు. మతోన్మాదులను అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు కె.రాములు, నాయకులు పైడిరాజు, అంబేద్కర్, శంకర్రావు సూర్యనారాయణ, రామారావు, చిరంజీవి, పివి రమణ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రెడ్డి శంకరరావు

ఆర్ఎంపిలకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి- చీపురుపల్లి

స్థానిక అన్నపూర్ణ ఆస్పత్రిలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన గ్రామీణ వైద్యులకు న్యూరో వ్యాధులపై బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా న్యూరో సర్జన్ డాక్టర్ రెడ్డి శంకరరావు మాట్లాడుతూ స్ట్రోక్ లక్షణాలను వివరించారు. మొహం పక్కకు తిరగడం, చేతులు, కాళ్లు కదలకపోవడం, మాట తడబడటం వంటి లక్షణాలుంటే స్ట్రోక్‌గా పరిగణించాలని చెప్పారు. లక్షణాలు కనిపించిన నాలుగు గంటల్లో రోగికి మెరుగైన చికిత్స అందిస్తే సాధారణ స్థితికి వస్తారని తెలిపారు. చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ తెంటు రమణమూర్తి మాట్లాడుతూ చలికాలంలో పిల్లలకు ఉబ్బసం, పక్కలు ఎగరేయడం, ఆకలి లేకపోతే పిల్లలు ఎక్కువగా ఏడవటం వంటి లక్షణాలుంటే వెంటనే సమీపంలోని పిల్లల వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు గెద్ద చిరంజీవి, జోనల్ ఉపాధ్యక్షులు అల్లాడ త్రినాథరావు జిల్లా ఉపాధ్యక్షులు రామ్మూర్తిరాజు, జిల్లా కార్యదర్శి కోట్ల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కనకమహాలక్ష్మి ఉత్సవాలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బొద్దాం గ్రామంలో కనకమహాలక్ష్మి ఉత్సవాలను గురువారం ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 5, 12, 19వ తేదీల్లో బొడ్డపాటి హరిశర్మ ఆధ్వర్యాన అర్చనలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

పోలీసు కుటుంబానికి చేయూత అందజేత

విజయనగరంకోట : జిల్లా పోలీసుశాఖలో పని చేసి, ఇటీవల మరణించిన పోలీసు కానిస్టేబుల్ షేక్ బాబా కుటుంబానికి 'చేయూత' అందించేందుకు పోలీసు సిబ్బంది పోగు చేసిన మొత్తాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం జిల్లా పోలీసు ర్యాలయంలో ఆ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగాఎస్‌పి మాట్లాడుతూ పోలీసుశాఖలో పని చేస్తూ ప్రమాదవసాత్తు లేదా ఆకస్మికంగా లేదా అనారోగ్యంతో మరణించిన పోలీసు కుటుంబాలు అర్ధంతరంగా తమ కుటుంబ యజమానిని కోల్పోయి, ఆర్థికంగా నష్టపోయిన సమయంలో వారికి ప్రభుత్వం నుండి బెనిఫిట్స్ అందేంత వరకు వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకొనేందుకు పోలీసుశాఖకు చెందిన ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. పోలీసు ఉద్యోగుల్లో ఐకమత్యం పెరగడంతోపాటు, వారి కుటుంబాలకు అండగా ఉన్నామన్న భరోసా లభిస్తుందని అన్నారు. ఈసందర్భంగా రూ.1,47,900ల చెక్‌ను షేక్‌బాబా సతీమణి షేక్ పర్వీన్ నిషా అందజేశారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.సౌమ్యలత, డిపిఒ ఎఒ పి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ ఎ.ఎస్.వి.ప్రభాకర రావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయానికి 2 పుష్‌కార్టులు

విజయనగరం టౌన్ : నగర వీధులను మరింత పారిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు సచివాలయానికి 2 చొప్పున పుష్ కార్టులను ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి సిబ్బందికి అందజేశారు. బుధవారం 150 పుష్ కార్టులను పాలాసుపత్రి వద్ద జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రజారోగ్య సిబ్బంది హాజరై అందుకున్నారు.ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు పారిశుధ్యం ఎంతో అవసరమని అన్నారు. వాణిజ్య కేంద్రాలు వద్ద అదనపు పుష్ కార్టులను విధులు నిమిత్తం అందజేశామని వెల్లడించారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

నగరంలోని కణపాక, మారుతీనగర్‌లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను కమిషనర్ పల్లి నల్లనయ్య పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా పరిమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో కచ్చితంగా పర్యవేక్షకుడు ఉండవలసిందేనని అన్నారు.

మహిళ అదృశ్యం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సారిపల్లి పంచాయతీ పరిధి నీలం రాజుపేటకు చెందిన మహిళ అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.గణేష్ తెలిపారు. నీలంరాజు పేటకు చెందిన జలుమూరు పెంటమ్మ(45) పై అదృశ్యం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పెంటమ్మ గత కొంతకాలంగా గ్రామస్తుల నుంచి రుణాలు ఎక్కువగా తీసుకుని వాటిని చెల్లించలేక వారి ఒత్తిళ్లకు భయపడే ఇంటి నుంచి ఈ నెల 29న బ్యాంకుకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిపోయిందని తెలిపారు. తన భార్య ఇప్పటి వరకు ఇంటికి తిరిగి రాక పోవడం తో భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. వివరాలు తెలిసినవారు 9121109444కు సమాచారం ఇవ్వాలని కోరారు.

13 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-బొండపల్లి

మండలంలోని బిళ్లలవలసలో దాడులు చేపట్టి, 13 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఎస్‌వి రామారావు తెలిపారు. మద్యం విక్రయిస్తున్న లింగం సూర్యనారాయణను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

సమాచార సేకరణలో ఎంఎస్‌పిలే కీలకం

ప్రజాశక్తి-రామభద్రపురం

గ్రామాల్లో ముందస్తు సమాచార సేకరణలో మహిళా సంరక్షణ పోలీసులే కీలకం కావాలని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు ఆదేశించారు. స్థానిక పోలీసు స్టేషన్లో బుధవారం ఎస్ఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఎంఎస్‌పిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికి కేటాయించిన గ్రామంలో వారు స్థిర నివాసముంటూ నేర సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించాలని సూచించారు. అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు తక్షణ పరిష్కారం చూపి రాజీ మార్గాన్ని ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.